# స్పాట్ వాల్యుయేషన్

## నాగభైరవ కోటేశ్వరరావు

హైదరాబాదులో అందం ఉంది. ఆకర్షణ ఉంది.

ఆ రెంటికీ అట్టడుగున చార్మినార్ అంత ఎత్తుగా, ఘాటుగా, నిజాంసాగరంత లోతుగా, పాతగా అవినీతికూడా ఉంది.

హైదరాబాదులో ఆకలి ఉంది.

అది ద్విపాత్రాభినయం చేస్తుంది.

ఒక్కోసారి ఫుట్‌పాత్స్ మీద నగ్నంగా, భయోద్విగ్నంగా కేక లేస్తుంది. మరోసారి విలువైన కార్లలో, విలువైన దుస్తుల్లో నవ్వుల్ని రువ్వుతూ తిరుగుతుంటుంది.

బంజారా హిల్స్ చరియల్లో గద్దె కట్టిన ఘనం—

అబిడ్స్ బాంకుల్లోనూ, ముత్యాల షాపుల్లోనూ మూలుగుతున్న ధనం.

లెజిస్లేటర్స్ క్వార్టర్సు చుట్టూ ఇరవైనాలుగ్గంటలూ పచార్లు చేసే అధికార దాహం—

ఆ ఊరి అతిశయాలని, కోరికలని పెంచి మరో ఊరిని ఆలింగనం చేసుకునేట్టు చేసినాయి.

ఆ 'జంట' నగరాల్లో ఖరీదైన మగాళ్ళుంటారు. ఇంకా ఖరీదైన ఆడవాళ్ళుంటారు.

వాళ్ళు మరీ ఖరీదైన కార్లలో తిరుగుతుంటారు. వాళ్ళు తిరగరు. వాళ్ళు కూర్చున్న కార్లే తిరుగుతూ వాళ్ళను తిప్పుతుంటాయి.

హైదరాబాదులో హాయిగా బతుకు దామని చేరుకున్న యువతరం తాలూకు నిరాశల కన్నీరు, నిట్టూర్పుల వేడికి ఆవిరై పైకి పోయి ఆశల మలయానిలం వీస్తే ఆ ఊరి సాయంత్రాలను తరుచు చల్లబరుస్తుంది.

అలాటి ఓ చల్లని సాయంత్రం—

నగరం సొగసైన ఎలెక్ట్రిక్ లైట్ల సొమ్ములను సింగారించుకొనే వేళ—

నయాపూల్ మీద రాసులు పోసి అమ్ముతున్న పూల పరిమళం నౌబత్ పహాడ్ జంటల్ని మత్తెక్కిస్తున్న వేళ—

ఆఫీసు బోనుల్లో ఆరు గంటల సేపు బంధించబడ్డ చిరుద్యోగి ఎలుకలు, అద్దె ఇళ్ళ కలుగుల్లో దూరడానికి అకువచ్చ బస్సుల మీద, అమాంబాపతు సైకిళ్ళ మీద పరుగులు తీస్తున్న వేళ—

కోరికల వలిగాలులు తీరికగా వాహ్యాళి చేస్తున్న వేళ—

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కోసం పది రోజుల పాడు హైదరాబాదు వచ్చి, ముప్ఫయి పదుల మంది ఇంటర్ స్టూడెంట్ల తెలుగు 'వెలుగు' చూచి, తూచి, మార్కులు వేసి, పది పలిరాత్రుల్ని ఒంటరి హోటల్ సింగిల్ రూమ్‌లో ఈడ్చి, వేడి, చలికీ, కోరికల పులికీ భయపడి బార్‌లో చేరుదామా?

బ్రోథల్స్ కౌగిట్లో దూరుదామా?

రెండింటి 'సారా'న్ని గ్రోలుదామా? —

—అని తేల్చుకోలేక లకిడీ—కా—పూల్ సెంటర్లో ఫుట్‌పాత్ మీద లెక్చరర్ ప్రసాద్ నిలబడ్డాడు, లెక్చరిస్తూ కాదు— పిక్చరెస్క్‌గా ఉండే ఆ స్పాట్ అందం చూస్తూ, తూస్తూ.

ఓ అందమైన కారు వచ్చి అతన్ని దాటి అల్లంత దూరంలో ఆగింది. దానిలోంచి ఓ చందమైన యువకుడు దిగి, ఎదురు షాపులోకి పోతున్నాడు. అతణ్ణే, అతడి వైఖరినీ చూస్తున్న ప్రసాద్‌కి ఆ రోజు తాను చదివిన ఓ కవితలో అర్థంకాని—'అదృష్టం తిని పుట్టిన వాళ్ళంటే ఎవరో అర్థమైనట్టు తోచింది.

'నమస్కారం, మాస్టారూ!' అంటూ అతని వేపే నడుస్తూందో యువతి, తాను దిగిన అదే కారు తలుపును మూసుకుంటూ, చూస్తున్నవాళ్ళ చూపుల గంధాన్ని ఒళ్ళంతా రాసుకొంటూ.

అంత దూరం అనంతపురం నించి వచ్చిన తనకు ఇంత పెద్ద సిటీలో వింతగా విష్ చేసే ఆ ఇంతి ఎవరా అని చూస్తూ 'నమస్కారం' అన్నాడు ప్రసాద్.

'నన్ను గుర్తించలేదా, మాస్టారూ! నేను వసంతను.'

వసంతకాలంలా ప్రసాద్‌ని సమీపించింది వసంత.

వసంత? అవును.

ఐదు వసంతాలకు పూర్వం తాను లెక్చరర్‌గా చేరిన తొలి సంవత్సరం బి. ఎ. ఫైనల్ స్పెషల్ తెలుగు స్టూడెంట్ వసంత!

ప్రేమకీ, కామానికీ, అనురాగానికీ, ఆపేక్షకీ తేడా ఏమిటో చెప్పమని తొలి పాఠం మధ్యలోనే తనను ప్రశ్న వేసి 'ఫంక్' తినిపించిన అల్లరి స్టూడెంట్ వసంత!

'వాసంత సమీరం నీవై,
హేమంత తుషారం నేనై—'

అంటూ పెనగొ్గ వెకిలిగా పాడిన కో—స్టూడెంట్ రంగనాథం మీద ఓడుక్కోకుండా—

'వ్యసనానికి రాని నీవై,
హసనానికి రాణిని నేనై' అంటూ తనూ పాడి, 'థాంక్యూ, మై డియర్ మజ్నూ' అనే కాంప్లిమెంట్ అతని ముఖాన పారేసి తన గరల్ ఫ్రెండ్సుతో నవ్వుతూ, నాజూగ్గా నడుచుకుంటూ పోయిన జాణ వసంత!

కాలేజీ బ్యూటీగా, అనంతపురం విజయనిర్మలగా, రాయలసీమ హేమమాలినిగా నిక్‌నేమ్సుతో యువకులకు డ్రీమ్ గరల్ వసంత!

పువ్వులా అందంగా, నవ్వులా స్వచ్ఛంగా ఉండే వసంత – ఇప్పుడు, ఇక్కడ—ఈ హైదరాబాదులో ఇంత హుందాగా.

పెళ్ళి ఆడపిల్లల్లో చలాకీతనానికి ఫుల్‌స్టాప్ పెడుతుంది కాబోలు! చిలిపితనానికి తిలోదకా లిచ్చి అణకువతనానికి వాకిళ్ళు తెరుస్తుంది కాబోలు!

'గుర్తు రాలేదా, మాస్టారూ?'

'ఓ గుర్తు లేకేం! హౌ డూ యూ డూ?' అన్నాడు ప్రసాద్.

'ఆమె కన్నులలోన అనంతాంబరంపు నీలినీడలు గలవు'. భావకవి కృష్ణశాస్త్రి ప్రసాద్ గుండెల్లో మూలిగాడు.

'బాగున్నాను, మాస్టారూ!' తృప్తిగా జవాబు చెప్పింది వసంత నవ్వుతూ.

'అంత అందమైన కార్లో తిరిగే వసంత బాగుండకేం?' అనుకున్నాడు ప్రసాద్.

'మరి. . . వారు' అన్నాడు కారు దిగి షాపులోకి పోయిన యువకుణ్ణి గుర్తు తెచ్చుకుంటూ.

'వారు. . . మా వారు' అంది వసంత సహజంగా.

'అంత ఖరీదైన మగాడు భర్తగా దొరికితే వసంత బాగుండకేం?' అనుకున్నాడు ప్రసాద్ మళ్ళీ. అనుకుంటూ 'నీలినీడల' భావకవి గొంతు మూయించాడు.

కారు హారన్ మోగింది. 'కమాన్, డార్లింగ్!' అన్నట్టు.

'వెళ్ళొస్తాను, మాస్టారూ' అంది వసంత, రెండు చేతులు జోడించి నిండు నమస్కారం చేస్తూ.

'మంచిది' అన్నాడు ప్రసాద్.

'ఐ. ఎ. ఎస్. ఆఫీసర్‌కీ, మంత్రివర్యుడికీ కూడా హృదయపూర్వకమైన నమస్కారం దొరకదు ఈ రోజుల్లో. అది దొరికేది ఒక్క టీచరుకే. అందుకే ఆ ప్రొఫెషన్ అంటే తనకు మరీ ఇష్టం' అనుకున్నాడు తృప్తిగా ప్రసాద్.

ఆమె వెనక్కి తిరిగింది హుందాగా. హుందాగానే నడిచింది. హుందాగానే కారెక్కి కూర్చుంది.

పెళ్ళి ఆడపిల్లల్లో ఎంత పెద్దరికాన్ని తెచ్చి పెడుతుంది! కారు ముందుకు సాగింది. వసంత వెనక్కి తిరిగి చూస్తుందనుకున్న ప్రసాద్‌కి నిరాశే మిగిలింది. అందుకే కాదు, ఇంకా కొన్ని 'అందుకులకు' ప్రసాద్‌కి డిసప్పాయింట్‌మెంటు కలిగింది.

వసంత తనని భర్తకు పరిచయం చేస్తుందనుకున్నాడు. చేయలేదు.

'రేపు మా ఇంటికి లంచ్‌కి రండి, మాస్టారూ' అని ఆహ్వానిస్తుందనుకున్నాడు. అడగలేదు.

ప్రసాద్ వసంత తనని ఇంటికి పిలుస్తుందని అనుకోవడానికి కారణాలు లేక పోలేదు.

వసంతలాగే తన ఓల్డు స్టూడెంట్సు మూర్తీ, కమలామణీకూడా.

ఎ. జి. ఆఫీసులో పనిచేసే మూర్తి విస్సు తనకు ఆతిథ్యమిచ్చాడు. మూర్తి భార్య కృష్ణ బి. ఎ. చదువుతూందిట. ఆమె ట్రీట్‌మెంటు ఎంత సంస్కారయుతంగా ఉందని!

ఎ. ఐ. ఆర్. లో పనిచేస్తున్న కమలామణీ, ఆమె భర్తా మొన్న మధ్యాహ్నం డిన్నరిచ్చారు.

కాని, వసంత పిలవలేదు.

అందుకని ప్రసాద్‌కి నిరాశ కలగలేదు.

ప్రసాద్ కో సంగతి గుర్తుకు వచ్చింది.

బి. ఎ. పరీక్షల ఫలితాలు తెలిశాక, వసంత తన స్నేహితురాళ్ళిద్దరిని వెంట బెట్టుకొని తన రూముకు వచ్చింది. పళ్ళూ, పూలూ, పండ్లూ తెచ్చింది—తను పాసైనందుకు సంతోషం పంచి, కృతజ్ఞత చెప్పడానికి.

తను న్నాడు: 'పండ్లు—సరే తెచ్చావ్. బాగుంది. మరి పూలెందుకు బ్రహ్మచారి గాడికి?'

వసంత కిసుక్కున నవ్వింది చలాకీగా, చిలిపిగా.

ఇందాకటి నవ్వులో ఆ చిలిపితనం లేదు.

హుందాతనం ఉంది.

పెద్దరికం ఉంది.

'అలంకార శాస్త్రం మీరు చెబితే మళ్ళీ వినాలని ఉంది, సర్' అంది ఆనాడు తన రూములో వసంత.

'ఏ టేకిట్ ఏజ్ ఎ కాంప్లిమెంట్!' అన్నాడు తాను.

ఆ మాటలు ఈ ఐదేళ్ళ నించి అప్పుడప్పుడూ గుర్తుకు వచ్చి తన వెంత సంతోషపరిచేవో!

ఇప్పుడా మాటలు మళ్ళీ ప్రసాద్‌కు గుర్తుకు వచ్చాయి. వసంత మళ్ళీ ఆ మాటలు ఈ వేళ అంటే ఎంత బాగుండేది! ఆమె అనలేదు. అనడమే కాదు, అసలేం మాట్లాడింది గనక?

అందుకే ప్రసాద్‌కి నిరాశగా ఉంది.

దీర్ఘంగా నిట్టూర్చాడు.

• • •

'టాక్సీ!' పిలిచాడు ప్రసాద్.

ఆగింది. ఎక్కాడు.

'త్రీ ఏసెస్!'

టాక్సీ పోతూంది.

మీటరు తిరుగుతూంది దూరాన్ని పైసల్లోకి, రూపాయల్లోకి మారుస్తూ. మనోభారాన్ని కొలిచే మీటరుంటే? తన మనోభారం మాక్సిమమ్ నంబర్ చూపేది.



'త్రీ ఏసెస్' లో అప్పుడే జనం నిండుతుంది. తనో ఒంటరి టేబిల్ ముందు కూర్చున్నాడు ప్రసాద్. తను ఒంటరివాడు.

జీవితంలో ఇంకా జంట దొరకనివాడు.

భారతి ఛటర్జీ—బెంగాలీ అమ్మాయి పాడుతూంది.

'దునియా మే ప్యార్ హై
సబ్‌సే జరూరత్ హై'— ఆశా భోన్‌స్లే కంఠానికి కార్బన్ కాపీలా ఉంది ఛటర్జీ గొంతు.

ఛటర్జీ అందంగా ఉంది. వసంతలా కాదు. ఇదో అందం. వసంతది వెన్నెల్లా నిశ్చలమైన అందం.

ఛటర్జీది ట్యూబ్‌లైట్‌లా జిగేల్ మనే అందం.

బేరర్ వచ్చాడు. మెనూ తెచ్చాడు. ప్రసాద్ చెప్పాడు. చెప్పిన డ్రింక్సు బేరర్ తెచ్చాడు.

ఛటర్జీ ఇంపుగా పాడుతూంది హిందీలో.

'నా కన్నీళ్ళు తుడవడానికి ప్రయత్నించ
వద్దు
నీ చేతులు కాలితే అందుకు బాధ్యత
నాది కాదు.'

ఎంచక్కటి భావం అది! ఛటర్జీ పాడుతూంది. రసికులు గొంతులు కలుపుతున్నారు లోతగా, మోతగా.

ఈ హోటల్ బయటిదో లోకం;
లోపల మరో లోకం.

బయటి లోకంలో డబ్బూ, సంపాదనా, పాపం, బ్యాంకూ వగైరా. లోపలి లోకంలో సుఖం, మత్తూ, హాయీ, ఆనందం వగైరా.

'ఈ మనుషులు ద్విముఖులు. తమ్ముతాము మోసం చేసుకుంటున్నారు' అనుకున్నాడు ప్రసాద్.

ప్రసాద్‌కి తన లేడీ స్టూడెంట్సు వరసగా గుర్తొచ్చారు. సినిమాల్లో స్థిరపడ్డ నీలవేణీ; లెక్చరుగా విజ్ఞానదానం చేస్తున్న చారుమతి; భర్తలకి సుఖాలనీ, పిల్లలనీ ఇస్తున్న అనసూయా, జానకీ, మిరండా; భర్తల వేణ్ణీళ్ళ సంపాదనలకి చన్నీళ్ళుగా సాయపడుతూ, సుఖంగా జీవిస్తున్న కమలామణీ, రంగనాయకమ్మ, భారతి.

అదృష్టాన్ని, ఆనందాన్ని గుండె నిండా పండించుకున్న ఇందాకటి వసంత—వీళ్ళంతా తన స్టూడెంట్సు.

అందరూ తన క్లాసు గదుల్లోంచి బయటకు పోయినవాళ్ళే. వాళ్ళ జీవితాల్లో, వాటి విధానాల్లో ఎంతటి వైరుధ్యం ఉన్నా, అందరూ హాయిగానే ఉన్నారు. సుఖపడుతున్నారు. 'తనకు అంతకన్నా కావలసిం దేముంది' అనుకున్నాడు ప్రసాద్. తాను సినిక్.

గోరంతను కొండంతగా ఆలోచిస్తాడు. ఏమీ లేనిదానికి ఈ సాయంత్రమంతా డల్‌గా, మొరోజ్‌గా గడిపాడు. ఛ! బాగాలేదు తన మనస్తత్వం.

అందరూ తృప్తిగా, హాయిగా ఉన్నప్పుడు తన కేం?

'ఆల్ ఈజ్ వెల్ విత్ ది వరల్డ్' అనుకున్నాడు ప్రసాద్. తన ఒంటరి జీవితానికి మాత్రం తృప్తి లేదు అనుకొన్నాడు ప్రసాద్.

'ఈ ఏడు తప్పక వివాహం చేసుకోవాలి.' గట్టిగా నిర్ణయించుకొన్నాడు ప్రసాద్.

డాన్సర్ సరోజా రాకతో హోటల్లో ఓ ఉత్సాహం, ఉద్వేగం విద్యుత్తులా ప్రవహించింది. ప్రసాద్ అక్కడ ఉండలేకపోయాడు. లోకంలో తాను ఒంటరి వాణ్ణి అనుకున్నాడు. బిల్ పే చేసి బయటపడ్డాడు.

బయట బిచ్చగాళ్ళు.

లోపల సుఖాల బిచ్చగాళ్ళు.

బయట ఆకలి బిచ్చగాళ్ళు.

లోపల ఆనందాల బిచ్చగాళ్ళు.

లోపల మూడంకెల బిల్లు చెల్లించే ఆ సుఖాల బిచ్చగాళ్ళు ఈ ఆకలి బిచ్చగాళ్ళ చేతుల్లో మూడు పైసలుకూడా రాల్చకుండా కసురుకుంటారు.

పిటీ లేదు సిటీకి!

ప్రసాద్ టాక్సీ ఎక్కాడు.

బ్రోథల్ హౌస్‌లను గూర్చి డ్రైవర్ని వాకబు చేశాడు.

పోనిమ్మన్నాడు.

ప్రసాద్‌కి మళ్ళీ చారుమతీ, నీలవేణీ, రంగనాయకమ్మా, కమలామణీ, వసంతా గుర్తుకు వచ్చారు. వాళ్ళంతా ఈ అర్ధరాత్రి భర్తల కౌగిళ్ళలో వెచ్చగా నిద్రపోతుంటారు. 'మే గాడ్ బ్లెస్ దెమ్ విత్ పీస్ అండ్ కంఫర్ట్!' యోగీశ్వరుడిలాగా మనస్సులో ఆశీర్వదించాడు ప్రసాద్.

ఏ లెక్చరుకైనా తన స్టూడెంట్సు సుఖం కంటె కావలసిం దేముంది? తను రమ్మీ ఆడి వంద రూపాయలు సంపాదించిన నాటికంటే, ఒక క్లాసులో సక్సెస్‌ఫుల్‌గా లెక్చరిచ్చి బయటికి వచ్చిన నాడు ఎక్కువ హేపీగా ఫీల్ అవుతాడు. అదే టీచింగ్ ప్రొఫెషన్‌లోని మజా! తన స్టూడెంట్సంతా సుఖంగా ఉండాలని గట్టిగా కోరుకున్నాడు ప్రసాద్!

కారు ఓ ఆధునికమైన బంగళా ముందు ఆగింది.

ప్రసాద్ దిగి టాక్సీ వాడికి ఓ నోటు విసిరాడు. బోయ్ ఎదురువచ్చి రిసీవ్ చేసుకొని ముందు నడుస్తున్నాడు.

కాంపౌండ్ లోపల వెన్నెల్లో, కొబ్బరి చెట్ల నీడల్లో ముగ్గు రాడాళ్ళు, ఇద్దరు మగాళ్ళు డ్రింక్సు పుచ్చుకుంటూ కూర్చున్నారు రౌండ్ టేబిల్స్ చుట్టూ!

అవతల దూర దూరంగా ఓ రెండు జంటలు కబుర్లు చెప్పుకుంటున్నాయి.

ప్రసాద్‌ను అప్‌స్టెయిర్స్ మెట్ల దగ్గరకు తీసుకువెళ్ళాడు బోయ్.

ఆ మెట్లు దిగుతున్న దెవరు?

ఖరీదైన దుస్తుల్లో ఉన్న ఆ యువకుడు...అతడే! అతను వసంత భర్త!

అతడి చేయి తన భుజం మీదుగా వేసుకొని, తన చేయి అతడి నడుం చుట్టూ వేసి అతనితో దిగుతున్న యువతి! వసంత కాదు!



ఇడియట్! వీడికేం పోయే కాలం? ఇంట్లో రంభ లాంటి వసంతను పెట్టుకొని ఈ చెడు తిరుగుళ్ళా? బ్రూట్!

స్కౌండ్రల్!

తన స్టూడెంట్ వసంత భర్త ఇలాంటి వాడని ఊహించని ప్రసాద్‌కి షాక్ తిన్నట్లయింది. వసంత మీద బోలెడంత సానుభూతి కలిగింది. ఆమెలో చిలిపితనం, చలాకీతనం మాయమై పోవడానికి కారణం ప్రసాద్‌కి క్షణంలో బోధపడింది. అందమైన కార్లో తిరిగే వసంత వెనక ఎంతటి అఖాతం! ఆమె లేత గుండెల్లో ఎన్ని తుఫానులు! 'పూర్ బర్డ్' అనుకున్నాడు సానుభూతితోనే ప్రసాద్. 'నీలినీడల' భావకవి ప్రసాద్ గుండెల్లో గర్వంగా కళ్ళజోడు సవరించుకున్నాడు.

'ఈ "కారెక్టర్‌లెస్ డాగ్" వసంతనెంత క్షోభ పెడుతున్నాడో! పాపం, వసంత!' అనుకున్నాడు ప్రసాద్.

మెట్లమీద అతడూ, ఆ యువతీ తనను దాటి పోయేటప్పుడు ఆమె తాలూకు సుతారపు ఫ్రాగ్రెన్సూ, అతడి నించి వచ్చే ఘాటు పానీయాల స్ట్రాంగ్ వాసనా మిళితమై ప్రసాద్‌కు ఓ విధమైన ఏవగింపు కలిగించినాయి.

ఆ యువకుడు తనను గమనించినట్లే లేదు.

బోయ్ ప్రసాద్‌ని ఓ గదిలో ప్రవేశపెట్టాడు.

డిమ్ బ్లూలైట్స్!

డబుల్ కాట్‌మీద ఫోమ్ బెడ్. అందమైన రవికలని తొడుక్కున్న 'పిన్నప్' పిల్లలు. రవికలూ గట్రా ఏమీ లేని నగ్నసుందరులు గోడల నిండా!

ప్రసాద్ గది మధ్య—

ప్రసాద్ కన్‌ఫ్యూజన్ మధ్య—

బోయ్ శాల్యూట్ చేసి వెళ్ళబోతుంటే ప్రసాద్ అడిగాడు:

'అత నెవరు?'

మెట్లమీద తనకు ఎదురుపడ్డ వసంత భర్త, అతడి ప్రక్క నాజూగ్గా మెట్లు దిగే ఆధునిక యువతి, వాళ్ళ తాలూకు వాసనా ప్రసాద్ మనస్సును పూర్తి అదోలా చేసినాయి.

'ఆ సావ్‌కీ సుదీర్‌సాబ్ అని సెప్తార్, సాబ్!'

'అంటే?' నిశితంగా అడిగాడు ప్రసాద్.

'మినిస్టర్ సాబ్‌కి బేటా. నిన్నట్కీ మాల్ ఈ పొద్దుట్కీ, ఈ పొద్దుట్కీ మాల్ రేపట్కీ కామ్ నై. అలా-రోజ్ తాజా సరుక్కు హోనా.'

బోయ్ వెళ్ళిపోయాడు.

రూమ్ మధ్య సిగరెట్ పొగ.

పొగ మధ్య ప్రసాద్.

ప్రసాద్ మనసు మధ్య తన స్టూడెంట్ తిరుగుబోతు భర్త.

# గంగాపుర చెన్నకేశవాలయం


అత్యంత శిథిలావస్థలో ఉన్న మందిరాలు, కట్టడాలన్నీ గంగాపురం మట్టూ మైళ్ళతరబడి మనకు కనబడతాయి. హంపీ విజయనగర శిథిలాలకు, ఓరుగల్లు శిథిలాలకు ఏమాత్రం తీసిపోనివి. ఇక్కడ శిథిలావస్థలో ఉన్న ఆలయాలు, ప్రాకారాలు, విగ్రహాలు మొదలైనవన్నీ వేయి సంవత్సరాల క్రితంనాటి పశ్చిమ చాళుక్యరాజుల కళావైభవాన్ని యాత్రికులకు నేడు చాటి చెబుతున్నాయి. మహోత్కృష్టమైన నకుకళావైభవం నేడు శిథిలావస్థలో చూసినప్పుడు యాత్రికుల హృదయాలను కలచివేస్తుంది కూడా.

ఒకానొకనాడు మహా నగరంగా వెలసిన గంగాపురం నేడు కేవల మొక చిన్న గ్రామం మాత్రమే. మహబూబ్‌నగరం పట్టణానికి సుమారు ఇరువది అయిదు కిలోమీటర్ల దూరంలో ( కల్వకుర్తి తాలూకా ) ఉన్న గ్రామం గంగాపురం— వేయి సంవత్సరాల క్రితం పశ్చిమ చాళుక్య రాజుల పాలనలో మహానగరంగా విలసిల్లి 'మాయాపురి'గా ఆనాడు ప్రఖ్యాతి గాంచింది. శైవ కవి అయిన పాల్కురికి సోమనాథుడు తన 'పండితారాధ్య చరిత్ర'లో గంగాపురాన్ని పవిత్ర స్థలంగా పేర్కొన్నాడు. ప్రతి సంవత్సరం మాఘ మాసంలో ఇక్కడ రథోత్సవాలు జరుగుతాయి.

తెలంగాణంలోని ప్రసిద్ధ కవులలో ఒకడైన మల్లారెడ్డి క్రీ. శ. 1700 వ సంవత్సరంలో గంగాపురం చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని గూర్చి గ్రంథ రచన గావించాడు. గంగాపురంలోని అతి ముఖ్యమైన దేవాలయం శ్రీ చెన్నకేశవ స్వామి వారిది. శ్రీ చెన్నకేశవస్వామివారి విగ్రహం అతి రామణీయకమై మన హృదయాలను ఆకర్షిస్తుంది. గజేంద్రుని రక్షించడానికై శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారమే శ్రీ చెన్నకేశవ అవతారమని అంటారు.

గజేంద్రుని రక్షింప తరలిన శ్రీ విష్ణువు అవతారమైన చెన్నకేశవస్వామిని నేడు మనం గంగాపురంలో దర్శిస్తాం.

శ్రీ చెన్నకేశవస్వామివారి మందిరం క్రీ. శ. ఆరవ శతాబ్దంలో నిర్మింపబడినట్టిది. తరవాత క్రీ. శ. పదవ శతాబ్దంలో పశ్చిమ చాళుక్య రాజులు ఈ మందిరాన్ని పునరుద్ధరణ కావించారు. పశ్చిమ చాళుక్య వంశజుడైన శ్రీ వీర హొంబాళుడు మందిరంలో శ్రీ చెన్నకేశవస్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. అయితే, మందిర బహిఃప్రాకారాలను, కుడ్యాలను ఈ రాజులే నిర్మించారని ఇచ్చటి శిలా శాసనముల ద్వారా తెలియవస్తున్నది. ఆలయ ప్రాంగణంలో అత్యంత సుందరమైన సరోవరం, మంటపాలు, సభా గృహ ఉన్నాయి. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ దేవాలయం అలనాటి కళా వైభవాన్ని అద్భుతంగా చాటుతుంది. నేటి గంగాపుర



శిథిలాలలో అసంఖ్యాకములైన విగ్రహాలు ( శ్రీ విష్ణువు, శక్తి, భైరవ, జైన, బుద్ధ విగ్రహాలు ) జీర్ణావస్థలో మనకు కనిపిస్తాయి. ఈ దేవతలకు సంబంధించిన అనేకమైన మందిరాలు కూడా మనకు ఇక్కడ కనబడతాయి. ఇది చాళుక్య రాజుల మతాతీత దృక్పథానికి నిదర్శనమనుటలో సందేహం లేదు.

గంగాపుర మందిర సమీపంలో 'గొల్లత్తగుళ్ళు' అనే ప్రదేశం చారిత్రకంగా అతి ముఖ్యమైనది. ఈ మధ్య కాలంలో పురాతత్త్వ శాఖ వారు జరిపిన పరిశోధనల ఫలితంగా అనేక విగ్రహాలు దొరికాయి. అందులో మహోన్నతమైన, రమ్యమైన శ్రీ బుద్ధభగవానుని విగ్రహం అతి ముఖ్యమైనది. పాలమూరు మండలంలోని ( మహబూబ్‌నగర్ ప్రాంతం ) అతి ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలలో గంగాపురం ఒకటి.

రచన, ఫొటోలు:
మత్స్యరాజ హరగోపాలరావు

---

'స్కాండల్' అనుకున్నాడు ప్రసాద్.

గది బయట గాజుల శబ్దం!

మల్లెల పరిమళం!

తలుపు తోస్తూ వచ్చే మెత్తని పాదాల శబ్దం!

'తలిరాకు జొంపముల సందుల నేత్రాలు తుహిన కిరణ కోమలరేఖవో! నునుదీపవో! వెలదీ! ఎవ్వతెవు నీవు. . .' ప్రసాద్ మనసులో భావకవి.

వసంత!

అవును, వసంతే!

తన స్టూడెంటు వసంతే!

ఆ యువకుడి కారులో ఉన్న వసంతే!

నిన్నటి సరుకు వసంత!

తాజా 'మాల్' కాని వసంత!

తన ఓల్డు స్టూడెంట్ వసంత!

**పతనమైన వసంత!**

**పతిత వసంత!**

షాక్ తిన్నది ప్రసాదే కాదు, వసంత కూడా.

అతని నరాల్లో ఏహ్యం, కోపం, జుగుప్స; ఆమె నరాల్లో భయం, సిగ్గు, షేమ్.

ప్రసాద్ వేళ్ళ మధ్య సిగరెట్ చురుక్కుమంది.

అతడి మనసులో ఓ ఆలోచన తళుక్కుమంది.

తాను ఈ సిట్యుయేషన్ తప్పించాలి. తప్పించుకోవాలి.

ఈ అన్‌వాంటెడ్ మూమెంట్స్ నుండి తాను తప్పుకోవాలి. వసంతను తప్పించాలి.

తెలుగు లెక్చరర్ ప్రసాద్ మనసు సూరేకారంలా పని చేసింది. తాను నటించాలి.

తన స్టూడెంట్ వసంతను హర్ట్ కాకుండా కాపాడాలి.

అతనిలో 'టీచర్' పైకి వచ్చాడు.

ముఖంలో వికాసం తెచ్చుకున్నాడు ప్రసాద్!

వసంత పాలిపోయి నించుంది!

'అతన్ని వెదుక్కుంటూ నువ్వు ఇక్కడికి వచ్చావా, వసంతా! ఇది నరకం— నువ్వు ఇలాటి చోటుకు రాకూడదు. ఏమైనా, చెడిపోయిన భర్తలని మంచి దారికి తెచ్చుకోవడం భార్యల చేతుల్లోనే ఉంది. పది నిమిషాల కిందటే అతడు బయటకు పోతూ నాకు ఎదురయ్యాడు. ప్రయత్నించు. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!'

వసంత ఏమీ అనలేదు.

ఆమె ముఖంలో కృతజ్ఞత లాటిది అస్పష్టంగా గోచరించింది.

ప్రసాద్ లేచి ఒకా చేయి పుచ్చుకొని బయటకు నడిపించాడు. అతని చేతిలో యువరక్తం లాలూకు ఉద్వేగం లేదు. టీచర్ తాలూకు ఆప్యాయతే ప్రవహించింది. ఆమెను జాగ్రత్తగా మెట్ల మీంచి దింపుతూ నడిచాడు.

రోజూ తాను ఎక్కి దిగే పాత మెట్లే, అయినా, కొత్త మెట్లు దిగుతున్నంత జాగ్రత్తగా అడుగులు వేస్తూ దిగింది వసంత.

దిగాక 'థాంక్యూ, సర్' అని మాత్రం అనగలిగింది.

ప్రసాద్ పైకి ఎక్కి బెడ్ మీద కూర్చుని సిగరెట్ కాల్చాడు. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లో మార్కులు వేయకుండా ఎందరినో తప్పించిన ప్రసాద్ ఆ సిట్యుయేషన్ నైస్‌గా టాకిల్ చేసినందుకు తనకు తానే పాస్ మార్కులు వేసుకొని 'హమ్మయ్య' అనుకున్నాడు, దీర్ఘంగా నిట్టూర్చుతూ. ★